శంకరు నవతారంబగు
శంకర గురువర్యు దలతు సకలభయ వినా
శంకరు సర్వజ్ఞుని పద
పంకజముల గొలుతు జ్ఞాన వైభవ నిధులన్

శ్రీశ క్షీరాబ్ధివాస యోగీశ చక్రి
భోగివర భోగ మణి దీప్త పుణ్యమూర్తి
జన్మ వారిధి పోత శాశ్వత శరణ్య
చేతి సాయము నీవె లక్ష్మీనృసింహా

కమలభవ శక్రముఖ దేవ గణ కిరీట
చయ విఘట్టిత పద సారసరుచిమంత
శ్రీరమా కుచసరసిజ శ్రీమరాళ
చేతి సాయము నీవె లక్ష్మీనృసింహా

ఘోర సంసార జలధిలో క్రూర వక్ర
నక్ర దంష్ట్రలకున్ జిక్కి నలుగుచుంటి
వ్యగ్రుడను రాగ రసనోర్మి బాధితుడను
చేతి సాయము నీవె లక్ష్మీనృసింహా

భవ మహా ఘోరవనమున పంచబాణ
దుష్ట మృగ బాధలొందు నార్తుడను దేవ
మత్సర నిదాఘమున నిట మాడుచుంటి
చేతి సాయము నీవె లక్ష్మీనృసింహా

భవ గభీర కూపమ్మున బడితి దుఃఖ
సర్పశత బాధలకిట వేసారుచుంటి
దీనుడను నన్ను బ్రోవుమా దేవ దేవ
చేతి సాయము నీవె లక్ష్మీనృసింహా

లక్ష్మీ నృసింహా కరావలంబ స్తోత్రము (7-12 పద్యములు)

ఘోర సంసార సింధుర కుటిల హస్త
ఘాత నిష్పిష్టితాంగుడ నైతి దేవ
ప్రాణభీతిని బాపుమా భయవినాశ
చేతిసాయము నీవె లక్ష్మీనృసింహ

జన్మ సర్ప మహోగ్ర దంష్ట్రా కబళిఆళ
గరళ దగ్ధాంగుడను నేను గరుడ వాహ
అమృతసాగరావాస దయాలవాల
చేతిసాయము నీవె లక్ష్మీనృసింహ

భవమహా జాలమున జిక్కు వడితివి నింద్రి
యములనెడు గాలమునకు నేనగుదు నెరగ
తలయు దౌడలు వ్రక్కలౌ దయతలంచి
చేతిసాయము నీవె లక్ష్మీనృసింహ

భవము బీజమ్ము సంసార పాదపమున
కర్మములు బహుశాఖలు కాముడు విరి
ఫలము దుఃఖమా చెట్టెక్కి పడితి దేవ
చేతిసాయము నీవె లక్ష్మీనృసింహ

అతుల భయద సంసార దావానలంపు
జ్వాలలకు నూరువుల దాక కాలె దేవ
శరణు నాకింక నీ పాద సరసి యొకటె
చేతిసాయము నీవె లక్ష్మీనృసింహ

యమభటులు కంఠమునకు పాశమును వేసి
లాగుచుండిన విధము దలంప గలమె
మృత్యుభయనాశ నిన్ను స్మరింతు నీశ
చేతిసాయము నీవె లక్ష్మీనృసింహ

లక్ష్మీ నృసింహ కరావలంబ స్తోత్రము (13 - 18 పద్యములు)

శ్రీమదిందిరాసేవిత శ్రీ పదాబ్జ

కరకమలముల శంఖచక్రములు నభయ
వరద ముద్రలు నలరునో భద్ర రూప
చేతి సాయము నీవె లక్ష్మీనృసింహా

ప్రథిత ప్రహ్లాద నారద ప్రముఖ నైక
భాగవత భవ్య మానస పద్మవాస
భక్తజన పరిపాలన పారిజాత
చేతి సాయము నీవె లక్ష్మీనృసింహా

అంధుడ హృతవివేక మహాధనుడను
దొంగలింద్రియములు నన్ను ద్రోసిరిందు
మోహకూపమ్మునన్ వ్యథల్ పొందుచుంటి
చేతి సాయము నీవె లక్ష్మీనృసింహా

శ్రీశ వారిజనాభ సురేశ విష్ణు
ముక్తిదా మధుసూదన పుష్కరాక్ష
కేశవా వాసుదేవ శ్రీకృష్ణ వరద
చేతి సాయము నీవె లక్ష్మీనృసింహా

మాయచేత భవప్రవాహ మగ్నుడయ్యు
నే విభుని సాయమంది రక్షింపబడెనొ
అట్టి లక్ష్మీనృసింహ పాదాబ్జ భృంగ
మనెడు శంకరుడీ స్తోత్రమును రచించె

ఫలశ్రుతి

అమిత భక్తి భావమ్ముతో హరిని దలచి
ఈ స్తవమ్మును పఠించు వారీ ధరిత్రి
నఖిల భోగభాగ్యమ్ముల ననుభవించి
జీవితాంతమునన్ హరిన్ జేరగలరు